క్లుప్తంగా

ఘనంగా గోగులమ్మ జాతర



ఊనగట్లలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

చాగల్లు: మండలంలోని ఊనగట్ల గ్రామదేవత గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గరగలతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈనెల 21 వరకు అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఊనగట్ల సర్పంచ్ మట్టా వెంకట్రావు తెలిపారు. 20న బలిచేట, 21న అమ్మవారికి నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు ఉన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



వృద్ధురాళ్లకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మానవత సంస్థ సభ్యులు, దాతలు

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్లలో మంగళవారం 100 మంది పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు కొప్పుల వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఈ సేవా కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా మానవత సంస్థ కన్వీనర్ ఉన్నమట్ల లీలాలక్ష్మి సత్యభాస్కర ప్రసాద్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తున్న సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల కార్యదర్శి గెడా రామచంద్రరావు, సభ్యులు కాజా గంగరాజు, నీలం రామారావు, పెనుగొండ సుబ్బారాయుడు, కాపకాయల సూర్యనారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగో వార్డులో గడప గడపకూ..

కొవ్వూరు: పట్టణంలోని నాలుగో వార్డులో బుధవారం రెండో రోజు కూడా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి మంగళవారం తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సారథ్యంలో బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం అయ్యే ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆమె కోరారు.

సమిశ్రగూడెంలో అన్నసమారాధన

నిడదవోలు రూరల్: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని సమిశ్రగూడెం కాలువ గట్టు వద్ద గల అంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దేశాబత్తుల వెంకన్న ఆర్థిక సహాయంతో అన్నసమారాధన జరగ్గా, అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, నాయకులు దేశాబత్తుల నాగు, వడల అంబేడ్కర్, రావిపాటి శ్రీను, కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మంచినీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణ శివారు ప్రాంతాల వాసుల దాహార్తి సైతం తీర్చేందుకు చర్యలు చేపట్టామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చెప్పారు. తాగునీటి సరఫరా కోసం మున్సిపల్ సాధారణ నిధులు రూ.10.37 లక్షలతో కొనుగోలు చేసిన ట్రాక్టర్ ఇంజిన్, స్టెయిన్ లెస్ స్టీల్ వాటర్ ట్యాంకర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, ఎండీ షకీరా బేగం, మున్సిపల్ డీఈఈ మాధవీలత, ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా శిక్షణ

నిడదవోలు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం స్థానిక యోగా గురువు సానేపు సుబ్బారావు విద్యార్థులకు యోగాసనాలు ఎలా వేయాలో నేర్పించారు. ఈ సందర్భంగా యోగా గురువు సుబ్బారావు మాట్లాడుతూ ఆరోగ్యం, అలవాట్లు, ప్రకృతి జీవన విధానంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కుంచే చినబాబు, రచయిత వేదుల జనార్దనరావు పాల్గొన్నారు.



వెలవెలబోతున్న దేవరపల్లి మండలం యర్నగూడెం బస్టాండ్



తాళ్లపూడిలో శీతల పానీయాలతో సేద తీరుతున్న జనం



ఉండ్రాజవరంలోని కోళ్లఫారం షెడ్‌లో సింకులతో నీళ్లు వెదజల్లుతున్న దృశ్యం

ఎండ ప్రచండం

- అధిక వేడి, వడగాడ్పులు
- 48 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత
- దానికితోడు భరించలేని ఉక్కపోత
- అల్లాడుతున్న జనం
- నిర్మానుష్యంగా ప్రధాన సెంటర్లు
- వెలవెలబోతున్న బస్టాండ్లు



జన సంచారం లేక నిర్మానుష్యంగా నిడదవోలు రైల్వేస్టేషన్ రోడ్డు

దేవరపల్లి: భానుడి భగభగలతో జనం అల్లాడుతున్నారు. సూర్యోదయంతోనే సూర్యుడు నిప్పులు చెరుగుతుండడంతో ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. మెట్ట ప్రాంతంలో ఎండల తీవ్రత దారుణంగా ఉంది. రాత్రి వేళ కూడా వేడి తగ్గడం లేదు. మూడు రోజులుగా వడగాడ్పులు తీవ్రరూపం దాల్చాయి. మంగళవారం దేవరపల్లి మండలంలో ఉష్ణోగ్రత 49 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. వడగాడ్పులకు ఉదయం 11 గంటలకే ప్రధాన సెంటర్లు, వ్యాపార కూడళ్లు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. చిరు వ్యాపారులు దుకాణాలను మూసి వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటలు దాటాక దుకాణాలను తెరుస్తున్నారు. పండ్లు, కూరగాయల వ్యాపారస్తులు నష్టపోతున్నారు. శీతల పానీయాలకు డిమాండ్ ఏర్పడింది. ఏసీల వినియోగం పెరగడంతో పలు గ్రామాల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని యర్నగూడెం ప్రధాన సెంటర్ నిర్మానుష్యంగా ఉంది. బస్టాండ్‌లో ప్రయాణికులు లేక వెలవెలబోయింది.

తాళ్లపూడిలో 46 డిగ్రీలు

తాళ్లపూడి: కొద్ది రోజులుగా కొవ్వూరు నియోజకవర్గంలో పగటి ఉష్ణోగ్రతలు బాగా పెరిగాయి. సరాసరిన 45 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదవుతోంది. తాళ్లపూడిలో మంగళవారం 47 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. మే మూడో వారంలో నమోదయ్యే సరాసరి ఉష్ణోగ్రత కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల తీవ్రత పెరగడంతో మధ్యాహ్న సమయంలో రోడ్లపైకి రావడానికి ప్రజలు జంకుతున్నారు. జన సంచారం లేక కొందరు వ్యాపారులు మధ్యాహ్నం దుకాణాలను మూసి వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఎండలకు భయపడి మధ్యాహ్నం వేళ చాలామంది ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో ఎక్కడికక్కడే జ్యూస్ సెంటర్లు వెలిశాయి. కొబ్బరి బొండాలు, కూల్ డ్రింక్స్, పుచ్చకాయలు, నిమ్మసోడాలు, పండ్ల అమ్మకాలు ఊపందుకున్నాయి.

పెరవలిలోనూ..

పెరవలి: భానుడి భగభగలకు వడగాడ్పులు తోడయ్యాయి. నాలుగు రోజులుగా సూర్యుడు నిప్పుల వర్షం కురిపిస్తుండడంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రహదారులు నిర్మానుష్యంగా మారాయి. పెరవలి మండలంలో గత మూడు రోజులు 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా, సోమవారం ఏకంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో ప్రజలు అల్లాడిపోయారు. మంగళవారం 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గ్రామాల్లో కరెంటు కోతలు విధించడంతో ప్రజలు ఇంటిలో ఉండలేక వీధిలోకి రాలేక నానా అగచాట్లు పడ్డారు. కరెంటు ఉన్నప్పటికీ పిల్లలు, వృద్ధులు ఆపసోపాలు పడ్డారు. నిప్పులు కక్కుతున్న భానుడి ప్రతాపానికి వాహనాలను ఎక్కడికక్కడ నిలుపుదల చేయడంతో జాతీయ రహదారి నిర్మానుష్యంగా మారింది.

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలంలో వడగాడ్పుల తీవ్రత అధికమైంది. కొద్దిరోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా సోమవారం గరిష్టంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంగళవారం 46 డిగ్రీలకు పెరిగింది. ఇక మంగళవారం దీంతో ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టేందుకు ప్రజలు జంకుతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఉండ్రాజవరం: మూడు రోజులుగా మండలంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయి. దీంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆదివారం 43, సోమవారం 45, మంగళవారం 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండుతున్న ఎండల్లో పని చేయలేక కూలీలు తాలెత్తిపోతున్నారు. ఎండకు జడిసి కూలీలు వ్యవసాయ పనులు ఉదయం 6 గంటలకు ప్రారంభించి 12 గంటలకు ముగించేస్తున్నారు. సాధ్యమైనంత వరకు మధ్యాహం సమయంలో ప్రయాణాలు మానుకోవాలని, తప్పనిసరై బయటకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యుడు రాజనాల ప్రసాద్ సూచించారు. మండలంలోని తాడిపర్రు, ఉండ్రాజవరం, పాలంగి, చివటం, కాల్దారి, పసలపూడి, వేలివెన్ను తదితర గ్రామాల్లోని కోళ్లఫారాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే గుడ్డు ధర తగ్గడంతో నష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి స్థితిలో పెరిగిపోతున్న ఎండలు వారిని మరింత బెంబేలెత్తిస్తున్నాయి. ఎండ వేడికి కోళ్లు చనిపోయే ప్రమాదం ఉంది. షెడ్లపై ఎండు గడ్డి వేసి సింకుల ద్వారా నీళ్ల వెదజల్లుతూ కోళ్లను సంరక్షిస్తున్నారు.



మధ్యాహ్నం వేళ యర్నగూడెంలో మూతపడిన దుకాణాలు

నిడదవోలు: పట్టణంలో వారం రోజులుగా అత్యధికంగా 42.08 నుంచి 45.03 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్యాహ్నం ఎండ వేడిమి జడిసి కొనుగోలుదారులు రాకపోవడంతో చాలా మంది వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన సెంటర్లు జనసంచారం లేక వెలవెలబోయాయి. తోపుడు బండ్లు, సైకిళ్లపై వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులు సైతం రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో ప్రజలు బయటకు రావాలంటే గొడుగులు, కూలింగ్ గ్లాసులు, టోపీలు, తువ్వాళ్లను ధరించి బయటకు వచ్చి రాకపోకలు సాగిస్తున్నారు. ఎండవేడిమికి తట్టుకోలేక ప్రజలు శీతలపానీయాలను సేవించి కొంత మేరకు సేదతీరుతున్నారు. ఈ నెల 13న 42.02 డిగ్రీలు, 14న 43.07 డిగ్రీలు, 15న 42.08 డిగ్రీలు, మే 16న 45.03 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అల్లాడుతున్న చిరు వ్యాపారులు

గోపాలపురం: వడగాడ్పులకు చిరు వ్యాపారులు అల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రతకు పండ్లు, కూరగాయలు త్వరగా పాడైపోతున్నాయి. మంగళవారం 48 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదైంది. దాంతో అవి అమ్ముడుపోవడం లేదు. ఫలితంగా రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకూ నష్టం వాటిల్లుతోందని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 200 మంది వరకూ చిరు వ్యాపారులు రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి భానుడి భగభగలు పెరగడంతో సాయంత్రం వరకూ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. దీంతో దుకాణాలను మూసుకోవాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. కూల్‌డ్రింక్, జ్యూస్ వ్యాపారాలు మాత్రం అంతంత మాత్రంగా సాగుతున్నాయంటున్నారు.

ఆంజనేయస్వామి సేవలో మంత్రి వనిత



పెనకనమెట్టలో స్వామివారిని దర్శించుకున్న హోం మంత్రి వనిత

కొవ్వూరు: మండలంలోని పెనకనమెట్ట గ్రామంలో నిర్వహిస్తున్న అభయాంజనేయ స్వామివారి జయంతి ఉత్సవాల్లో మంగళవారం రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి పట్టువస్త్రాలు సమర్పించి సత్కరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనలో మంత్రి పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, సర్పంచులు మేకల శ్రీనివాస్, వరిగేటి సుధాకర్, దాసరి సతీష్, కోడి శ్రీనివాస్, కోడి యర్ర వెంకట్రావు, పసలపూడి భూషణం, పసలపూడి మంగరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, పట్టణశాఖ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో విశేష పూజలు

చాగల్లు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా చాగల్లులోని అభయాంజనేయస్వామి వారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. గంధం సింధూరాలతో స్వామి వారికి అష్టోత్తర పూజలు చేశారు. మహాన్యాస పూర్వక అష్టోత్తర శత కలశాభిషేకం, పవిత్ర పుణ్య నదీ జలాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. లక్ష తమల పాకుల పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉమా రామలింగేశ్వర భజనమండలి వారు భజన కార్యక్రమం నిర్వహించారు.

పొగాకు సాగుకు ఎరువుల మోతాదు పెంచాలి

సీటీఆర్ఐ డైరెక్టర్‌కు రైతు సంఘం నేతల వినతి

గోపాలపురం: మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకు రైతులకు నూతన వంగడాల సరఫరాతో పాటు ఎరువుల సరఫరా మోతాదును కూడా పెంచాలని గోపాలపురం పొగాకు వేలం కేంద్రం రైతు సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం రాజమహేంద్రవరం వెళ్లి సీటీఆర్ఐ డైరెక్టర్ ఎం.శేషుమాధవ్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. శేషుమాధవ్‌ను కలిసిన అనంతరం సిద్ధివినాయక వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఇల్లూరి పెంటలరాజు, అన్నమరెడ్డి సోమరాజు మాట్లాడుతూ భూసారం తగ్గిన నేపథ్యంలో వర్జీనియా పొగాకుకు ప్రస్తుతం అందిస్తున్న ఎరువులు సరిపోవడం లేదన్నారు. అందువల్ల దిగుబడులు తగ్గి రైతు నష్టపోతున్నట్లు సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్‌కు వివరించినట్లు తెలిపారు. డైరెక్టర్‌ను కలసిన వారిలో వుండవల్లి సూర్యచంద్రప్రసాద్, మట్టపర్తి పార్థసారథి, జుజ్జవరపు ప్రసాద్ ఉన్నారు.

సంక్షేమ పథకాలకు జవాబుదారులం

- అందుకే ఇంటింటికీ వస్తున్నాం
- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు నాలుగో వార్డులో గడప గడపకూ..



వార్డు ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు జవాబుదారీతనం వహిస్తూ ఇంటింటికీ వస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని నాలుగో వార్డు క్రిస్టియన్‌పేటలో మంగళవారం రాత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను సక్రమంగా అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహాయాన్ని అంకెలతో సహా మంత్రి వివరించారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలను మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో కొవ్వూరు మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, మాజీ కౌన్సిలర్ భావన రాజేష్ (బెన్ని), ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, నాయకులు బత్తి నాగరాజు, వరిగేటి సుధాకర్, ఉప్పులూరి సూరిబాబు, యాళ్ల నరసింహారావు, బోడపాటి హనుమంతరావు, పతివాడ రామారావు, ఘంటా గోపాలరావు, మాసా ఆనంద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీలు



ఉండ్రాజవరం ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్ తదితరులు



చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వద్ద అవగాహన ర్యాలీ

చాగల్లు: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఆ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం మండలంలోని బ్రాహ్మణగూడెం, కలవలపల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఆ రెండు గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి కె.నిషిత మాట్లాడుతూ గ్రామస్తులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మరో వైద్యురాలు పీఆర్ఎల్ దేవి మాట్లాడుతూ వాడిన ప్లాస్టిక్ గ్లాసులు, కొబ్బరి బొండాలు బయట పడేస్తే వర్షం వచ్చినపుడు అందులో నీరు నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ శ్రీనివాస్, పీహెచ్ఎన్ పద్మ, ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కలవసల్లి పీహెచ్‌సీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.సౌజన్య, వైద్యులు ఆవినాష్, ఎంపీహెచ్‌ఈవో కాటంరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో..


ఉండ్రాజవరం: డెంగీ వ్యాధిపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆ పీహెచ్‌సీ వైద్యుడు రాజనాల ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో సీహెచ్ఓ సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు కె.నాగమణి, రామకృష్ణ, జిన్నూరి శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశా, సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని బాలాజీనగర్ సచివాలయంలో మంగళవారం డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం ఒకటో వార్డులో డెంగీ, మలేరియా నివారణ మార్గాలు, పరిశుభ్రతపై ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల ముకుందం, ఆరోగ్య కార్యదర్శి బి.అంజలి, పారిశుధ్య కార్యదర్శి టి.ప్రసన్నకుమారి, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృథా నీటి నిర్మూలనతో దోమల నివారణ

కొవ్వూరు: ఇళ్ల వద్ద ఖాళీ కుండీల్లో, తాడి పడేసిన కొబ్బరి బొండాల్లోను, టైర్ల వంటి వాటిలో నిల్వ ఉన్న నీటిలో డెంగీ వ్యాధికి కారణమయ్యే దోమలు పెరుగుతాయని మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని క్రిస్టియన్‌పేటలో మంగళవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. వృథా నీటి నిర్మూలన ద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రజలు తమ వంతుగా సహకరించాలని కోరారు. వైద్య,ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు.



కొవ్వూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం. చిత్రంలో మునిసిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి

లోకాస్ యాప్‌తో మహిళా సంఘ కార్యకలాపాలు


- గ్రామ, మండల సమాఖ్య సభ్యులకు శిక్షణ



నల్లజర్ల సెర్ప్ కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులకు శిక్షణ

నల్లజర్ల: స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఎల్ఎం (జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్) ప్రారంభించింది. దీనిని సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో రుణాల మంజూరు, సద్వినియోగం, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు, సంఘ నిర్ణయాలు, ఐక్యత తదితర అంశాలు సేకరించనున్నారు. ఇందుకోసం కేంద్రం ప్రభుత్వం లోకాస్ పేరుతో ఒక యాప్‌ను తీసుకు వచ్చింది. సంఘాల సమస్త సమాచారం ఇందులో పొందుపరిచేలా గ్రామ, మండల సమాఖ్య సభ్యులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నల్లజర్లలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైంది. ప్రతి సంఘానికి చెందిన కుటుంబ సభ్యుల వివరాలు ఈ యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు ఏపీఎం నాగేశ్వరరావు తెలిపారు. పొదుపు సంఘంలో చేరక ముందు వారి పరిస్థితి ఏమిటి? చేరాక ఆర్థిక పరిస్థితి ఎలా ఉందనే అంశాలపై ఆరా తీస్తారన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కలపాల లక్ష్మి, కార్యదర్శి గుత్తికొండ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా అవార్డులు పొందిన విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉండ్రాజవరం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం గర్వించదగిన విషయమని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య కొనియాడారు. టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారిద్దరూ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అంబటి మాధురి (576), కాజ జ్యోతి (572), తీట్ల సలోమి (572), మాదిరెడ్డి వెంకటేష్ (568), ఎం.శిరీష (568) మండల స్థాయిలో అత్యుత్తమ మార్కులు పొందారు. వారిని ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. 'నాడు–నేడు' పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను మరింతగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు, ఎంఈఓ పీవీఎస్ నాగరాజు, పాలాటి శరత్‌బాబు, వివిధ పాఠశాల హెచ్‌ఎంలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.